క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్ రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చెట్టును ఢీకొన్న వాహనం



చెట్టును ఢీకొన్న టాటా ఏసీ వాహనం

వేముల : వేములకు సమీపంలో శుక్రవారం టాటా ఏసీ వాహనం చెట్టుకు ఢీకొంది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. కడప నుంచి టాటా ఏసీ వాహనం బెంగళూరుకు బయలుదేరింది. వేముల సమీపానికి రాగానే డ్రైవర్ వినయ్ నిద్రలోకి జారుకోవడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది.

నివాళి

చింతకొమ్మదిన్నె : తాడిగొట్ల పంచాయతీకి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సమ్మిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి సుబ్బమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

దోమల నివారణకు ఏసీఎం పిచికారి

వేముల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెస్తవారిపల్లె దగ్గర ఉన్న రోడ్డు నిర్మాణ కార్మికుల తాత్కాలిక వసతి గృహాలలో దోమల నివారణకు ఏసీఎం పిచికారి చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు కార్మికుల తాత్కాలిక వసతి గృహాలలో కార్మికులు దోమ కాటుకు గురికాకుండా ముందు జాగ్రత్తగా ఏసీఎం పిచికారి చేస్తున్నామన్నారు. ఈ అల్ఫాసైపర్ మిత్రిన్ 10 నుంచి 12 వారాలపాటు దాని యొక్క పని సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. పిచికారి ప్రదేశంలో దోమ వాలితే నిమిషాల్లోనే చనిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇ-శ్రమ కార్మిక కార్డుపై అవగాహన

ఎర్రగుంట్ల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ-శ్రమ కార్మిక కార్డువలన చాలా లబ్ధి ఉంటుందని కమలాపురం అసిస్టెంట్ లేబర్ అధికారి ఏవీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో అసంఘటిత రంగ కార్మికులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి ఇ-శ్రమ కార్మిక కార్డు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇ కార్డును ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ గర్భస్రావాలు చేయించడం చట్టరీత్యా నేరం

తొండూరు : అక్రమ గర్భస్రావాలు చేయించడం చట్ట రీత్యానేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. మండలంలోని మల్లేల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లల శాతం గణనీయంగా తగ్గుతుందని, అక్రమ గర్భస్రావాలు చేయించడం చట్ట రీత్యా నేరమన్నారు. అబ్బాయి కావాలని ఆడ శిశువులను స్కానింగ్ ద్వారా తెలుసుకుని భ్రూణ హత్యలు చేయించడం అమానుషమన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : పోట్లదుర్తిలోని మజ్జారి భాగ్యశ్రీ(18) అదృశ్యమైనట్లు యువతి తల్లి గంగాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో భాగ్యశ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శుక్రవారం సరుకుల తెచ్చిపెట్టుకోమని చెప్పి తల్లి పనికి వెళ్లింది. యువతి ఇంటికి తిరిగిరాకపోవడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేసి మాట్లాడారు. పేకాట, గంజాయి, క్రికెట్ బెట్టింగ్, ఇసుక దందా, మట్కా, అక్రమ రేషన్ బియ్యం రవాణాలకు అడ్డుకట్టవేయాలని సీఐ పురుషోత్తంరాజుకు ఆదేశించారు.

చెరువు కట్టను తవ్వేస్తున్నారు



చెరువులో మట్టి తవ్వుతున్న ప్రొక్లెయిన్

మైలవరం : మండలంలోని గంగుల నారాయణపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న తలమంచిపట్నం పంచాయతీ పరిధిలోని వెంగక్క చెరువు కట్టను సైతం కూటమి నాయకులు వదలడం లేదు. జమ్మలమడుగు మున్సిపాలిటీలో అనధికారికంగా వేస్తున్న లేఆవుట్‌లకు యథేచ్ఛగా చెరువు మట్టిని తవ్వేస్తున్నారు. ఈ చెరువు వర్షకాలంలో నీరు నిల్వ ఉండటంతోపాటు పరిసర గ్రామాలైన గంగులనారాయణపల్లి, తలమంచిపట్నం, దుగ్గనపల్లి తదితర గ్రామాలలోని పంటలకు కాలువల ద్వారా నీరు వెళుతుందన్నారు. ఎండా కాలంలో చెరువు ఎండిపోతే పరిసర గ్రామస్తులు చెరువు మధ్యలో నుంచి పొలాలకు మట్టిని తరలించేవారు. అయితే ప్రస్తుతం కూటమి నాయకులు ఖర్చు ఎక్కువ వస్తుందనే ఉద్దేశ్యంతో కట్టకు పోసిన మట్టినే తరలించడం వివాదాస్పదంగా మారుతుంది. గతంలో ఎప్పుడులేని విధంగా కట్ట సమీపంలోనే మట్టి తరలిస్తే భవిష్యత్తులో తమ పంట పొలాలు ప్రమాదంలో పడుతాయని చెరువు కింద సాగు చేసుకునే రైతులు వాపోతున్నారు. వాస్తవంగా ఈ చెరువు కట్టకు పది మీటర్ల దూరంలోనే మట్టిని తవ్వడంతో వర్షాకాలంలో కట్ట తెగిపోయే ప్రమాదం ఉందంటూ గ్రామస్తులు వాపోతున్నారు.

కట్ట తెగే ప్రమాదం ఉంది



వెంగక్క చెరువు కింద సుమారు 300 ఎకరాల భూమిని రైతులు సాగు చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడులేని విధంగా కట్ట పక్కనే మట్టి తవ్వడం వల్ల చెరువు ప్రమాదంలో పడుతుంది. మట్టి తొలే వారు నడి చెరువు నుంచి తీసుకు పోయిన ఎవరికి ఇబ్బంది ఉండదు. కాని కట్ట పక్కన నుంచి మట్టిని తీయడం వల్ల భవిష్యత్తులో కట్ట కోతకు గురి అయ్యే ప్రమాదం ఉంది.

– మార్తల గురుప్రతాప్‌రెడ్డి, గంగుల నారాయణపల్లి

అధికారులు చొరవ చూపాలి



ఈ చెరువుకు దొడియం, రంగనాయకులకోన, నక్కానిపల్లి, మురపంది తదితర గ్రామాల నుంచి వర్షకాలంలో నీరు వచ్చి చేరుతుంది. కట్ట సమీపంలో మట్టి తవ్వడం వల్ల కట్టకు ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలి.

– గురుమోహన్‌రెడ్డి, గంగులనారాయణపల్లి

సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

చింతకొమ్మదిన్నె : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం ఇప్పపెంటలో రైతులకు ఉద్యాన శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన అధికారి జ్యోతీర్మయి మాట్లాడుతూ మామిడిలో ఫ్రూట్ కవర్లను వాడటం వలన నాణ్యమైన దిగుబడులు రావడంతో పాటు తామర పురుగు, తేనెమంచుపురుగు, పండుఈగ నుంచి రక్షణ ఉంటుందన్నారు. మామిడి తోటల్లో కాయలు నిమ్మకాయ, కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు గాలి చొరబడకుండా తొడిమ వరకు ఫ్రూట్ కవర్ కట్టుకోవాలి. రైతులకు 50 శాతం రాయితీతో గరిష్ఠంగా 1 హెక్టార్‌కు 10 వేల కవర్లకి రాయితీ వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కేవీకే ఊటుకూరు శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి పూత విచ్చుకున్నపటి నుంచి తేలిక పాటి తడులతో ప్రారంభించి నీటిని ఇవ్వాలన్నారు. కాయ పెరిగే దశలో 13:0:45 10గ్రా/లి, యూరియా 5గ్రా/లి పిచికారి చేస్తే కాయ ఎదుగుదలకు తోడ్పడుతాయన్నారు. మండల వ్యవసాయ అధికారి ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

పశుగ్రాసం అందజేత



గోశాలకు తరలుతున్న పశుగ్రాసం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామానికి చెందిన కొందరు యువరైతులు గ్రామంలోని పశుగ్రాసాన్ని సేకరించి కాశినాయన మండలంలోని జ్యోతిక్షేత్రంలోని గోశాలకు తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్లతో తరలించి గోశాల నిర్వాహకులకు అందజేశారు. మూడు సంవత్సరాల నుంచి గ్రామంలో పశుగ్రాసం సేకరించి అక్కడికి తరలిస్తున్నామని యువరైతులు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభ చూపాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : సమాజ, కుటుంబ సేవల్లో మహిళల పాత్ర ఎనలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రజిత మాట్లాడుతూ మదర్ థెరిస్సా, ఝాన్సీ లక్ష్మీబాయి, కల్పన చావ్లా, ద్రౌపది ముర్ము వంటి ఎందరో వీర మహిళల జీవితాలు ఆదర్శమన్నారు. మహిళలు వివిధ సేవలతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు ఏఎస్ఐ శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మీదేవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బేసిక్ ప్రైమరీలను కాపాడుకోవడానికి ఉద్యమిస్తాం

వేంపల్లె : అసంబద్ధంగా తరగతుల విలీనాన్ని చేస్తూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలను రద్దు చేయాలని చూస్తే ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 117జీవో రద్దు పేరుతో పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్తూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఐదు కిలోమీటర్ల పరిధిలోని మోడల్ ప్రైమరీలకు విలీనం చేస్తూ మండలస్థాయి అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలల తల్లిదండ్రుల అభిప్రాయాలను గాని ఎస్ఎంసీ కమి టీ సభ్యుల తీర్మానాన్ని కానీ పరిగణలోకి తీసుకోకపోవడం తగదన్నారు.

బాలికల విద్యా వికాసానికి కృషి చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

కమలాపురం : సమాజంలో ఆడ, మగ తేడా లేదని, ప్రతి ఒక్కరూ సమానం అని, ముఖ్యంగా బాలికల విద్యా వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమలాపురం నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిడ్డంగి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బేటి బచావో-బేటి పడావో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలికల విద్యా వికాసానికి తల్లిదండ్రులు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. మధ్యలో చదువు ఆపకూడదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేటి బచావో-బేటి పడావో అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. పారిశ్రామిక, వ్యవసాయ, ఐటీ తదితర రంగాల్లో మహిళలు పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. ఆడ పిల్లలను చిన్న చూపు చూడటం తగదన్నారు. ముఖ్యంగా చిన్నారుల తల్లులు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. చిన్నారుల విద్యా వికాసం తోడ్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ రాణి, ఏఎన్ఎం ధనలక్ష్మీ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

టెక్నాలజీలో అమూల్యమైన అవకాశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ డైరెక్టర్ భగవన్నారాయణ

వేంపల్లె : గ్రీన్ హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీలో విద్యార్థులకు అమూల్యమైన అవకాశాలు అందిస్తాయని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ భగవన్నారాయణ తెలిపారు. ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గ్రీన్ హైడ్రోజన్, ఫ్యూయల్ సెల్స్‌ను ఉపయోగించి విద్యుత్ గా మార్చడంపై శుక్రవారం ఒక్కరోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. స్థిరమైన శక్తి అభివృద్ధిలో హైడ్రోజన్ ఇంధన కణాలు పోషించే ముఖ్యమైన పాత్రను వారు హైలెట్ చేశారు. ఈ రంగంలోని కంపెనీలు విద్యార్థులకు హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీలో ముందుకు సాగడానికి అమూల్యమైన అవకాశాలను అందిస్తాయన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి నిల్వ, రవాణా, ఇంధన కణాల ద్వారా హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మార్చడం యొక్క వివిధ అంశాలను సెమినార్‌లో ఆయన చర్చించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి పి. రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డి.రమేష్ కైలాస్, కన్వీనర్లు కోటేశ్వరి, హెచ్‌ఓడీలు సౌజన్య, కార్తీక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి

వేంపల్లె : వీరన్నగట్టుపల్లిలో చెత్తవేశారని అడిగినందుకు శుక్రవారం వృద్ధురాలిపై ముగ్గురు దాడి చేశారు. అలవలపాటి యల్లమ్మ తన ఇంటి పక్కన చెత్తాచెదారాలు, దోసకాయ తొక్కలు వేయడంతో ఎవరు వేశారని అడగడంతో పక్కనే నివాసముంటున్న మారెమ్మతోపాటు కుమారుడు మల్లికార్జున, భార్య పద్మలు వృద్ధురాలు యల్లమ్మపై దాడి చేశారు. మనమడు అంజి ఆమె వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్కే వ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నీటి సరఫరా పైపులైన్ పరిశీలన

పులివెందుల టౌన్ : పట్టణంలోని మంగళ కాలనీలో ఉన్న నీటి సరఫరా పైపులైన్ వాల్వ్‌లను మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ ఇంజనీర్ చిందానందరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నీటి సరఫరా విషయంలో ఎలాంటి అంతరాయం కలగకూడదన్నారు. ప్రతి రోజు సచివాలయ అమెనిటీ సెక్రటరీ నీటి సరఫరా లైన్‌మెన్‌తో కలిసి వార్డులలో తిరుగుతూ ఎక్కడ నీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

పన్నులు కట్టకపోతే ఆస్తుల జప్తు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇంటి, నీటి పన్నులను ఈనెల 15వ తేదీ లోపు చెల్లించాలని లేని పక్షంలో ఆస్తులను జప్తు చేసి సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ వసూళ్లపై అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 16వ తేదీ నుండి బకాయిదారులపై నగర పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు.

బీడు పొలానికి నిప్పు

పులివెందుల రూరల్ : గుండ్లమడుగు పొలాలలో సాతుపాటి విష్ణువర్ధన్ అనే రైతు పొలం పక్కలో బీడు పొలంలో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో తోటలోని డ్రిప్ పైపులు కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షలుపైన నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొండ ప్రాంతాలలో అడవులకు నిప్పు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళా సమస్యలపై అవగాహన

సింహాద్రిపురం : మహిళల నాయకత్వ స్థానాల్లో ఎదుర్కొంటున్న సవాళ్ళు, జెండర్ సమానత్వంపై ఆవశ్యకత, అనే అంశాలపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న బాలికలకు ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ గురుదేవి, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల రూరల్ : సోలార్ పీవీ ఇన్‌స్టాలర్ శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని న్యాక్ అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని న్యాక్ భవనంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ సహకారంతో న్యాక్‌లో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు సోలార్ ఎనర్జీలో సోలార్ పీవీ ఇన్‌స్టాలర్ – సూర్యమిత్ర వృత్తి విద్యా కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ శిక్షణ 90 రోజులపాటు ఉంటుందని, ఉచిత వసతి, భోజన వసతి కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. నిరుద్యోగ యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985142155, 9032382762 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అంధత్వ నివారణ మనందరి బాధ్యత

లింగాల : అంధత్వ నివారణ మనందరి బాధ్యత అని లింగాల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సుభాషిణి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ సురేష్‌రెడ్డి, సీహెచ్‌ఓ శివరాం, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఎందులోనూ తీసిపోకూడదు

పులివెందుల రూరల్ : మహిళలు ఎందులోనూ తీసిపోకూడదని ఎంపీడీఓ రామాంజనేయులురెడ్డి తెలిపారు. స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో శుక్రవారం ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినులచే నిర్వహించిన 2కె రన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలతలు ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాబున్ని, సరితాదేవి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొండగొర్రె మాంసం పట్టివేత

వేంపల్లె : వేంపల్లి బీట్ పరిధిలోని కప్పలమడుగు సమీపంలో శుక్రవారం 4 కిలోల కొండ గొర్రె మాంసాన్ని పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా పారిపోతుండగా వారిని పట్టుకున్నామన్నారు. అయితే వారి వద్ద నుండి నాటు తుపాకీతోపాటు కత్తులు, నాలుగు కిలోల కొండ గొర్రె మాంసాన్ని స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సీడీపీఓ శ్రీలతను సన్మానిస్తున్న మహిళా అధ్యాపకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి ఆహ్వానం మేరకు పులివెందుల పట్టణ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత ముఖ్య అతిథిగా విచ్చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ గొప్పతనం గురించి వివరించారు. పూర్వకాలంతో పోలిస్తే ప్రస్తుత వర్తమాన కాలంలో మహిళలకు చాలా అవకాశాలు ఉన్నాయని, అన్ని రంగాలలోనూ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుతం చాలామంది మహిళలు లోకో పైలట్‌గా, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సివిల్ సర్వీస్, ఇతర శాఖలలో చాలామంది స్థిరపడ్డారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని మనం కూడా ముందడుగు వేసి మన సత్తాను ప్రపంచానికి చాటి చూపాలన్నారు. మహిళలకు ఉన్న ప్రత్యేక హక్కులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిన్నప్ప, ఉమెన్ సెల్, ఎన్ఎస్ఎస్ కో.ఆర్డినేటర్లు కళ్యాణి రెడ్డి, గంగాదేవి, మహిళా ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : మహిళను గౌరవించడం మన సంప్రాదాయమని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీ డిగ్రీకాలేజి, పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ డిగ్రీకాలేజి కరస్పాండెంటెంట్ నాగేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ రాజు పాల్గొన్నారు.

యథావిధిగా రిజిస్ట్రేషన్లకు అనుమతి

వేంపల్లె : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శెలవు రోజులైన శనివారం, ఆదివారాలు రెండు రోజులు కూడా యథావిధిగా రైతులు, ప్రజలు తమ భూములకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని భూములకు, ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ సాకే ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు రోజు లాగే తమ భూములకు, ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రావాలన్నారు. రెవెన్యూ శాఖలో రీ సర్వే ద్వారా ఏర్పడిన ఎల్ పీఎం నెంబర్లకు సంబంధించి ప్రభుత్వం డిసెంబర్-జనవరి నెలలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలలో రైతుల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించిన తర్వాత గత 16 నెలలుగా రిజిస్ట్రేషన్లకు నోచుకోని వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, వేంపల్లె మండలంలోని ముత్తుకూరు, నాగూరు, రామిరెడ్డిపల్లి పెండ్లూరు, చీమలపెంట, సి.గొంది పల్లె, ఆమని విశ్వనాథపురం, అద్దాలమర్రి, అంజనేయపురం, గోనుమాకులపల్లె, తంగేడుపల్లె, మొయిళ్ళచెరువు గ్రామాలకు రిజిస్ట్రేషన్లు ప్రక్రియ జరిపేందుకు కలెక్టర్, కడప జిల్లా రిజిస్ట్రారు పి.వి.ఎన్ బాబు, కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్డీఓ, తహసీల్దార్ల ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్లు కానివి కూడా ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందన్నారు. వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల గ్రామ పంచాయతీ నుండి వేరుకాబడిన గంగిరెడ్డిపల్లి గ్రామాల్లోని భూములు కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అడ్డంకులు పోయినట్లు తెలిపారు.

ఈనెల 8, 9 తేదీలలో రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పనివేళల్లో సంప్రదించి తమ ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. అలాగే ముఖ్యంగా ప్రభుత్వం నుండి ఎటువంటి డీటీసీపీ లే అవుట్ అప్రూవల్ లేకుండా యజమానులు ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెట్టులో.. చెట్టునై

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన మర్రిచెట్టులో తాటి చెట్టు పెరుగుతోంది. ఆ దారిన వెళ్లే వారంతా ఆ మర్రి చెట్టులో తాటిచెట్టు ఒకదానిలో ఒకటి అల్లుకుని ఉండటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అటువైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు మర్రి, తాటి చెట్ల వద్ద ఆగి ఫొటోలు తీసుకుని వెళుతుండటం విశేషం.



మర్రి చెట్టులో ఉన్న తాటిచెట్టు

రేపు అవగాహన కార్యక్రమం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రాణితోపు ఈట్ స్ట్రీట్‌లో ఉన్న సిరి సంజీవని ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత కృషి రత్న, ప్రఖ్యాత స్వతంత్ర ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త, ది మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి హాజరై సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం, మధుమేహ రహిత జీవన విధానంపై అవగాహన కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమ్మపై స్పెషల్ సాంగ్ విడుదల

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యా దీపం సినిమా నుంచి అమ్మ వై జన్మనిచ్చావే అనే పాటను విద్యార్థినులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లి ప్రేమ గురించి అద్భుతంగా చిత్రీకరించిన డైరెక్టర్ ఎస్‌కే, మూవీ ఎడిటర్ రవిలను అభినందించారు. ఇలాంటి పాటలు తీయడంవల్ల ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. అనంతరం ఈ పాటకు సహకరించిన డ్యాన్స్ మాస్టర్ శ్రావణ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.